లంచం ఇస్తేనే కరెంట్!

ఐదురోజులుగా నిలిచిన విద్యుత్తు సరఫరా.. సిబ్బంది తీరుపై భగ్గుమన్న రైతులు

రేగోడ్, డిసెంబర్ 26: లంచం ఇస్తేనే మరమ్మతులు చేసి కరెంట్ సరఫరా చేస్తానని విద్యుత్తు సిబ్బంది చెప్పడంపై రైతులు భగ్గుమన్నారు. మెదక్ జిల్లా రేగోడ్ మండలం మర్పల్లి గ్రామానికి ఐదురోజులుగా విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేపట్టకపోవడంతో సాగు, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్తు సిబ్బంది తీరును నిరసిస్తూ గురువారం రేగోడ్ సబ్‌స్టేషన్ భవనం పైకి ఎక్కి రైతులు ఆందోళనకు దిగారు. ఆర్టిజన్ కిషన్‌నాయక్‌కు ఐదు రోజులుగా విన్నవిస్తున్నా స్పందించడం లేదని మండిపడ్డారు. పైగా డబ్బులు ఇస్తేనే మరమ్మతు చేస్తానని చెప్తున్నాడని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏఎస్సై మల్లయ్య వచ్చి సముదాయించే ప్రయత్నం చేసినా వారు కిందకు రాలేదు. విద్యుత్ సరఫరా చేస్తేనే తాము దిగివస్తామని మొండికేశారు. ఏఎస్సై వెంటనే ఏఈ యాసిన్ అలీకి సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడికి చేరుకున్నారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి కిందికి దిగివచ్చారు. అనంతరం మర్పల్లి గ్రామస్థులు వట్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ భద్రారెడ్డితో కలిసి విద్యుత్తు సమస్యపై ఏఈకి వినతిపత్రం అందజేశారు.

మెదక్ జిల్లా మర్పల్లి రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకుంటున్న ఏఈ యాసిన్ అలీ

లోకం పోకడ



హైదరాబాద్ ట్రాఫిక్ జాముల్లో, మహిళల ఫ్రీ బస్సుల్లో అద్భుతమైన యాక్షన్ సీన్లు తీయొచ్చు.. జేమ్స్ కేమరూన్‌కు ఫోన్ చేయమంటారా

3న చలో కలెక్టరేట్

- ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం పిలుపునిచ్చిన ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, డిసెంబర్26 (నమస్తే తెలంగాణ): ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 3న చలో కలెక్టరేట్ చేపట్టనున్నట్టు బీసీ నేత ఆర్ కృష్ణయ్య తెలిపారు. కలెక్టరేట్‌తోపాటు ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయాలనూ ముట్టడించనున్నట్టు చెప్పారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ 'కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నది. కానీ ఇప్పటివరకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఒక్క రూపాయి విడుదల చేయలేదు. దాదాపు 17 లక్షల మంది విద్యార్థులు రోడ్ల మీదకు వచ్చి ఉద్యమిస్తున్నా స్పందించడం లేదు. ప్రభుత్వ తీరు చూస్తుంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర జరుగుతున్నట్టు అనుమానం వస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలి' అని డిమాండ్ చేశారు.

కోర్టుకు కొండా సురేఖ గైర్హాజరు

- జనవరి 3కు విచారణ వాయిదా

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : మంత్రి కొండా సురేఖ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ప్రజాప్రతినిధుల కోర్టు గతంలో తెలిపినప్పటికీ ప్రభుత్వ కార్యక్రమాల దృష్ట్యా గురువారం కోర్టుకు హాజరుకాలేకపోయారని ఆమె తరపు న్యాయవాది గైర్హాజరు పిటిషన్‌ను కోర్టుకు దాఖలు చేశారు. దీనిని కోర్టు అంగీకరించి విచారణను జనవరి 3కు వాయిదా వేస్తూ మెజిస్ట్రేట్ శ్రీదేవి ఉత్తర్వులు జారీచేశారు. ఫిర్యాదుదారుడు, సినీనటుడు నాగార్జున సైతం కోర్టుకు హాజరుకాకపోవడంతో ఆయన తరపున న్యాయవాది గైర్హాజరు పిటీషన్ దాఖలు చేశారు. ఇరువురి పిటిషన్లను అంగీకరించిన కోర్టు వచ్చే వాయిదాకు హాజరుకావాలని సూచించింది. పరువు నష్టం కింద క్రిమినల్ కేసు విచారణ నేపథ్యంలో కొండా సురేఖ ఇప్పటివరకు కోర్టుకు హాజరుకాలేదు.

అటకెక్కిన వార్ధా ప్రాజెక్టు

- ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్‌సర్కారు నిర్లక్ష్యం
- డీపీఆర్‌ను తిప్పిపంపిన కేంద్ర జలసంఘం
- ప్రాణహితపైనా ముందడుగు వేయని వైనం
- మాటలే తప్ప చేతలు శూన్యం
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు అందని సాగునీరు

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 'అమ్మ పెట్టదు.. అడుక్కుతిననివ్వదు' అన్న చందంగా వ్యవహరిస్తున్నది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు కొత్తగా ఒక్క ప్రాజెక్టునూ కట్టలేదు. ఇప్పుడు ఏడాది గడచినా ఆ దిశగా అడుగు వేయలేదు. కానీ, అనేకవిధాలుగా మేధోమథనం సాగించి రూపకల్పన చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వార్ధా ప్రాజెక్టును అటకెక్కించింది. సీడబ్ల్యూసీ కోరిన వివరాలను ఇవ్వకుండా ఉద్దేశపూర్వంగా కాలయాపన చేసింది. దీంతో ఆ ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్ర జలసంఘం వెనక్కి పంపింది. మరోవైపు ప్రాణహితపై తుమ్మిడిహెట్టి బరాజ్‌కు సంబంధించి ఇప్పటివరకు రాష్ట్ర సర్కారు చర్యలు చేపట్టలేదు.

కేసీఆర్ సుదీర్ఘ మేధోమథనం

ఉమ్మడి ఏపీ సర్కారు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టు డిజైన్‌ను ఇష్టారీతిన చేపట్టింది. వార్ధా, వేన్‌గంగా నదులు కలిసిన తర్వాత కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద రూ.2500 కోట్లతో బరాజ్‌ను నిర్మించాలని 2007లో ప్రతిపాదించింది. కానీ, ఆ నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టుపై నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. కానీ, తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో బరాజ్ నిర్మాణానికి పొరుగు రాష్ట్రం మహారాష్ట్ర అంగీకరించలేదు. ఆ ప్రాజెక్టుకు కావాల్సిన నీటిలభ్యత కూడా అందుబాటులో లేదని వెల్లడించింది. ఈ అంశాలన్నింటిపై కూలంకషంగా చర్చించి, సుదీర్ఘ మేధోమథనం సాగించిన మాజీ సీఎం కేసీఆర్, తెలంగాణ నీటిరంగ నిపుణులు.. తుదకు తుమ్మిడిహెట్టి వద్ద ఉమ్మడి ఏపీ సర్కారు ప్రతిపాదించిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో కీలక మార్పులు చేశారు. ఆ ప్రాజెక్టును 2 భాగాలుగా విభజించారు. తొలుత నీటిలభ్యత ఆధారంగా మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద కూడా బరాజ్‌ను నిర్మించడం ద్వారా 20 టీఎంసీలను ఎత్తిపోసి ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లోని 5 నియోజకవర్గాల పరిధిలో 2 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని ప్రణాళికలు రూపొందించారు. దానికే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత సుజల స్రవంతి ప్రాజెక్టుగా పేరు పెట్టారు. ముంపు నివారణ కోసం తుమ్మిడిహెట్టి బరాజ్ ఎత్తును 148 మీటర్లకు కుదించి మహారాష్ట్రతో చరిత్రాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. అనంతరం అనేక సాంకేతిక కారణాల వల్ల ఆ బరాజ్ నిర్మాణం ముందుకు సాగలేదు. తుమ్మిడిహెట్టి వద్ద 1.5 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో బరాజ్‌ను నిర్మించాలంటే సుమారు 6 కిలోమీటర్ల మేర కాంక్రీట్ నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందని, అదీగాక 100 నుంచి 110 గేట్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, మొత్తంగా బరాజ్ నిర్మాణానికి రూ.2,500 కోట్లకుపైగా వెచ్చించాల్సి వస్తుందని అంచనా వేశారు. మరోవైపు తుమ్మిడిహెట్టి పక్కనే చాప్రాల్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ఉండటం, అక్కడ దాదాపు 2,448 హెక్టార్ల అటవీ భూమి ముంపునకు గురయ్యే ప్రమాదం ఉండటంతో బరాజ్ నిర్మాణానికి అనుమతులు పొందడంలో సీడబ్ల్యూసీ నుంచి ఆటంకాలు ఏర్పడవచ్చని అధికారులు తేల్చిచెప్పారు. దీంతో ఆయా సమస్యలపై నాటి సీఎం కేసీఆర్ మరోసారి ఇంజినీర్లతో సుదీర్ఘ మేధో మథనం సాగించారు. తుదకు బరాజ్‌ను తుమ్మిడిహెట్టి వద్ద కాకుండా వార్ధాపై నిర్మించడమే పరిష్కారమని నిర్ణయించారు. ఆ తర్వాత ఆ ప్రాజెక్టు పేరును డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వార్ధాగా మార్చారు.

వార్ధాతో తక్కువ ఖర్చు.. తక్కువ ముంపు

తుమ్మిడిహెట్టికి ఎగువన పూర్తిగా వార్ధాపైనే బరాజ్‌ను నిర్మించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పక్కాగా అధ్యయనం చేయించింది. వ్యాప్కోస్ ద్వారా ప్రాథమిక సర్వే చేయించింది. తొలుత నీటి లభ్యతపై లెక్కలు తీయించి వార్ధాలో 58 టీఎంసీల నీటిలభ్యత ఉన్నట్టు తేల్చింది. అందులో వాస్తవానికి కావాల్సినవి 20 టీఎంసీలే. ఈ నేపథ్యంలో వార్ధాపైనే బరాజ్‌ను నిర్మించాలని నిర్ణయించింది. 653 మీటర్ల పొడవుతో బరాజ్ నిర్మించేందుకు దాదాపు రూ.1,000 కోట్లు సరిపోతాయని, తద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1,500 కోట్లపైగా ఆదా అవుతాయని అంచనా వేసింది. అంతేకాకుండా ఎలాంటి ముంపు లేకుండానే దాదాపు 5 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే వెసులుబాటు కలుగుతుందని తేల్చింది. అందుకు సంబంధించిన డీపీఆర్‌ను సిద్ధం చేసి సీడబ్ల్యూసీకి నివేదించాలని అధికారులను ఆదేశించింది. వార్ధా బరాజ్‌కు సంబంధించిన డీపీఆర్‌ను సిద్ధం చేసే బాధ్యతను కూడా వ్యాప్కోస్‌కు అప్పగించింది. అనంతరం బరాజ్ నిర్మాణానికే పరిమితం కాకుండా ప్రతిపాదిత ఆయకట్టుకు సంబంధించిన సాగునీటి కాలువలు, కరకట్టలు నిర్మాణాలన్నింటికీ కలిపి మొత్తం రూ.4,550.73 కోట్లతో డీపీఆర్‌ను రూపొందించడంతో ఆ ప్రతిపాదనలకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వమే ఆమోదం తెలిపింది.

జీవధారగా 75 కిలోమీటర్ల కెనాల్

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని గుండాయిపేట గ్రామం, అటు మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా అడేగావ్ గ్రామం మధ్యన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వార్ధా బరాజ్‌ను నిర్మించాలని నిర్ణయించారు. 653 మీటర్ల పొడవు, 12 మీటర్ల ఎత్తు, 27 గేట్లతో రోడ్ కమ్ బరాజ్‌ను సంకల్పించారు. తద్వారా ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలో మొత్తంగా 2 లక్షల ఎకరాలకు నీరందించేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తవ్విన కాలువలను కూడా ఇందులో వినియోగించేలా రూపొందించడం ముఖ్య విషయం. రాష్ట్ర విభజనకు ముందు పాలకులు డబ్బులు దండుకోవడమే లక్ష్యంగా ప్రాజెక్టులు చేపట్టారనడానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టే నిలువెత్తు నిదర్శనం. అప్పట్లో బరాజ్‌ను నిర్మించకుండానే తొలుత ఈపీసీ విధానంలో కాలువల తవ్వకాన్ని చేపట్టారు. ఇబ్బడిముబ్బడిగా కాంట్రాక్టర్లకు దోచిపెట్టారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా మొత్తంగా తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి రిజర్వాయర్ వరకు దాదాపు 116 కిలోమీటర్ల కాలువను, 75 మీటర్ల వెడల్పు, 12 మీటర్ల లోతుతో తవ్వాల్సి ఉన్నది. తెలంగాణ ఏర్పాటు నాటికే మొత్తంగా 75 కిలోమీటర్ల మేర కాలువ తవ్వకం పనులు పూర్తయ్యాయి. ఆ తర్వాత కాలువ అలైన్‌మెంట్ భూమిని సింగరేణి కోల్ ఫీల్డ్ కోసం డీమార్కేషన్ చేసింది. మరోవైపు బరాజ్ నిర్మాణం కాకపోవడంతో పూర్తయిన కాలువ సైతం నిరుపయోగంగానే మారింది. ప్రస్తుతం వార్ధాపై బరాజ్‌ను నిర్మించి అక్కడి నుంచి 20 కిలోమీటర్ల మేర కాలువను తవ్వి తుమ్మిడిహెట్టి దిగువన కుడిమెట్టిగూడెం వద్ద ఇప్పటికే తవ్విన కాలువతో అనుసంధానించనున్నారు. మొత్తంగా ఆ కాలువనే రిజర్వాయర్‌గా మార్చి 1.5 టీఎంసీలను నిల్వ చేయాలని కేసీఆర్ ప్రణాళికలను రూపొందించారు. వరద కాలువ తరహాలోనే ఈ కెనాల్‌ను సైతం జీవధారగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఉద్దేశపూర్వకంగానే కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం

కేసీఆర్ ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలోనే ఇంజినీరింగ్ అధికారులు వార్ధా బరాజ్‌కు సంబంధించిన డీపీఆర్‌ను అనుమతుల కోసం కేంద్ర జల సంఘానికి (సీడబ్ల్యూసీ)కి సమర్పించారు. హైడ్రలాజికల్ క్లియరెన్స్‌లు కూడా వచ్చాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో డీపీఆర్‌ను అప్రయిజల్ లిస్ట్ నుంచి తొలగిస్తున్నట్టు వెల్లడిస్తూ సీడబ్ల్యూసీ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. కంప్లయన్స్ రిపోర్ట్‌కు సంబంధించి మూడుసార్లు లేఖలు రాసినా పెండింగ్‌లోనే పెట్టారని పేర్కొంది. ఆ ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రలో వ్యవసాయ భూములు ముంపునకు గురవుతాయని, రివ్యూ కోసం డీపీఆర్‌ను ఇంటర్ స్టేట్ బోర్డుకు సమర్పించాలని, మహారాష్ట్ర అభిప్రాయాలు, అభ్యంతరాలు తీసుకోవాలని చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు స్పందన లేదని తెలిపింది. ఈ నేపథ్యంలోనే డీపీఆర్‌ను అప్రయిజల్ లిస్ట్ నుంచి తొలగిస్తున్నట్టు స్పష్టం చేసింది. సీడబ్ల్యూసీ కోరిన వివరాలను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేసినట్టు తెలుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులంతా తుమ్మిడిహెట్టి వద్దనే బరాజ్‌ను నిర్మిస్తామని బాహాటంగానే ప్రకటిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వార్ధా బరాజ్ డీపీఆర్‌ను పక్కనపెట్టారని ఇంజినీర్లు చెప్తున్నారు. మరి ప్రాణహిత బరాజ్‌పైనైనా చర్యలు చేపట్టారా అంటే అదీలేదు. ఇప్పటివరకు దానిపై మళ్లీ అధ్యయనం చేసింది లేదు. మహారాష్ట్రతో చర్చించింది లేదు. కానీ, అన్నివిధాలా అధ్యయనం చేసి అనుమతులకు తుదిదశలో ఉన్న వార్ధా డీపీఆర్‌ను నిర్లక్ష్యం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం తమ జీవితాలతో చెలగాటమాడుతున్నదని మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల రైతులు మండిపడుతున్నారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	18.2°c	29.8°c
నిజామాబాద్	18.7°c	30.2°c
మెదక్	18.9°c	31.6°c
ఖమ్మం	19.0°c	30.0°c
నల్లగొండ	19.0°c	27.0°c
హైదరాబాద్	20.2°c	25.0°c
వరంగల్	22.0°c	28.0°c
మహబూబ్‌నగర్	20.0°c	26.0°c
కరీంనగర్	21.0°c	28.0°c
రంగారెడ్డి	20.3°c	23.3°c

బలహీనపడిన తీవ్ర అల్పపీడనం

- నేడు మోస్తారు వర్షాలు కురిసే అవకాశం

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తేతెలంగాణ): బంగాళాఖాతంలోని తీవ్ర అల్పపీడనం గురువారం అల్పపీడనంగా బలహీనపడింది. దీని ప్రభావంతో తెలంగాణతోపాటు ఏపీలోనూ వర్షాలు కురుస్తున్నాయి. కోస్తా తీరం వెంట గంటకు 65 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తున్నాయి. శుక్రవారం కూడా మోస్తారు వర్షాలు పడుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇదే సమయంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మెరుగుపడుతాయని, సాధారణం కన్నా 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగానే నమోదవుతాయని తెలిపింది. మరోవైపు బుధవారం వరంగల్, ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి తదితర జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిశాయి. దీంతో ధాన్యం తడిసిపోవడంతో రైతులు కంటతడి పెడుతున్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకిచ్చిన హామీలను నెరవేర్చాలి

- సీఎం రేవంత్‌కు జాజుల శ్రీనివాస్‌గౌడ్ లేఖ

హైదరాబాద్, డిసెంబర్26 (నమస్తే తెలంగాణ): సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలన్నింటినీ సత్వరమే నెరవేర్చాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని ఎన్నికల సందర్భంగా వాగ్దానం చేసి ఇప్పుడు మరచిపోవడం తగదని చెప్పారు. వెంటనే వారిని రెగ్యులరైజ్ చేసి విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇంటిట సంక్షేమమని అనుకున్నామని, ఇంటి ఇంటి సంక్షోభం చేయవద్దని సూచించారు.

జీటీఏజేఏసీ చైర్మన్‌గా వీరాచారి

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్(జీటీఏ) జేఏసీ చైర్మన్‌గా మామిడోజు వీరాచారి నియమితులయ్యారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో లోకల్ క్యాడర్ గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్, గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ యూనియన్లు గవర్నమెంట్ టీచర్స్ జేఏసీగా ఏర్పడ్డాయి. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కో చైర్మన్లుగా బైండ్ల నర్సింహం, ఎం నళిని, కన్వీనర్‌గా డీ గిరివర్ధన్, కో కన్వీనర్‌గా కర్ణకోట శ్రీనివాస్‌గౌడ్, జనరల్ సెక్రటరీగా లక్ష్మీకాంతారెడ్డి, మహిళా కార్యదర్శిగా కోట సుకన్య, గౌరవ సలహాదారులుగా యాదగిరి, దశరథ్, సురేందర్ ఎన్నికయ్యారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లోని టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లుగా, మండల విద్యాధికారులుగా, డైట్ లెక్చరర్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని, ప్రతి జిల్లాలో డైట్ కాలేజీ ఏర్పాటుచేయాలని, పెండింగ్ డీఏ విడుదల చేయాలని తీర్మానించారు.

శాటిలైట్ సర్వే ద్వారానే రైతు భరోసా!

- ఎన్ఆర్ఎస్ఈకి సర్వే బాధ్యతలు
- కొన్ని జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్ పూర్తి
- పంట వేసిన భూమికే పెట్టుబడి సాయం

హైదరాబాద్, డిసెంబర్ 26(నమస్తే తెలంగాణ): శాటిలైట్ సర్వే ఆధారంగానే రైతులకు రైతు భరోసా పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నది. పంట వేసిన భూమికి మాత్రమే రైతుభరోసా ఇస్తామని చెప్తున్న ప్రభుత్వం.. పంట వేసిన భూమి గుర్తింపులో కచ్చితత్వం కోసం కసరత్తు చేస్తున్నది. ఇప్పటికే ఏఈవోలు చేస్తున్న మ్యాన్యువల్ సర్వేకు తోడుగా శాటిలైట్ సర్వే ద్వారా పంటల సాగును లెక్కించాలని నిర్ణయించినట్టు వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. శాటిలైట్ సర్వే నిర్వహించే బాధ్యతను ప్రభుత్వం నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్సీ)కి అప్పగించినట్టు తెలిసింది. ఈ ప్రక్రియలో రాష్ట్రస్థాయి సంస్థ తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ (టీఆర్ఏసీ) ఎన్ఆర్ఎస్సీతో కలిసి పని చేయనున్నది. ఇప్పటికే ఇందుకు సంబంధించి కొన్ని జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు పూర్తిచేసినట్టు సమాచారం. అయితే, ఏఈవోలు చేసిన సర్వేకు, శాటిలైట్ సర్వేకు సుమారు 10% తేడా ఉన్నదని గమనించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో శాటిలైట్ సర్వేను మరింత పకడ్బందీగా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సమాచారం. ఇప్పటికే రాష్ట్రంలో ఏఈవోలు క్షేత్రస్థాయిలో పంటల సాగును లెక్కిస్తున్నారు. మొన్నటివరకు మ్యాన్యువల్‌గా లెక్కించిన ఏఈవోలు ప్రస్తుతం కేంద్రం తీసుకొచ్చిన డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా లెక్కిస్తున్నారు. ఇది కూడా దాదాపుగా శాటిలైట్ సహాయంతోనే చేస్తున్నారు. పంట పొలంలో నిల్చుంటేనే ఈ యాప్ పని చేస్తుంది. ఈ నేపథ్యంలో ఇటు ఎన్ఆర్ఎస్సీ, అటు ఏఈవోలు చేసే డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వే లెక్కల ఆధారంగా రైతుభరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది.

పంట వేస్తేనే 'భరోసా'

వ్యవసాయాన్ని స్థిరీకరించాలని, రైతులకు ఆర్థికంగా అండగా నిలబడాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ సర్కారు సాగుకు అనుకూలమైన భూమికి రైతుబంధు అందించగా, కాంగ్రెస్ సర్కారు మాత్రం పంట వేసిన భూమికి మాత్రమే రైతు భరోసా ఇస్తామని చెప్తున్నది. ఈ లెక్కన వానకాలంలో పంటలు సాగు చేసి, యాసంగిలో పంటలు వేయని భూములకు రైతు భరోసా రాదు. నిజానికి, వానకాలంతో పోల్చితే యాసంగిలో సగం విస్తీర్ణంలోనే పంటలు సాగవుతాయి. వానకాలంలో 135 లక్షల ఎకరాల్లో పంటలు సాగైతే, యాసంగిలో 60 లక్షల ఎకరాల్లోనే పంటలు సాగవుతాయి. దీంతో యాసంగిలో సగం భూమికి, సగం మంది రైతులకు రైతు భరోసా బంద్ పెట్టడం ఖాయంగా కనిపిస్తున్నది. దీంతో సాగుకు అనుకూలమైన భూమి ఉన్నప్పటికీ నీళ్లు లేక, పంటలు వేయలేక నష్టపోయిన రైతులకు కనీసం రైతు భరోసా కూడా దక్కని పరిస్థితి ఎదురుకాబోతున్నది.

ఊయల ఊగుతూ అనంతలోకాలకు

గద్వాల జిల్లాలో చిన్నారి మృతి

ధరూరు, డిసెంబర్ 26 : ఇంటి ముందు ఉన్న ఊయల ఊగుతూ ప్రమాదవశాత్తు దూలం విరిగి పడటంతో బాలిక మృతి చెందింది. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకున్నది. ధరూరు మండలం నాగర్‌దొడ్డిలో చాకలి వెంకటేశ్ తన ఇంటి వద్ద బట్టలు ఆరబెట్టేందుకు దూలం ఏర్పాటు చేశాడు. ఆ దూలానికి డ్రిప్‌పైప్‌తో ఊయల కట్టాడు. గురువారం అతడి కూతురు సునీత (9) ఊయల ఊగుతుండగా.. ప్రమాదవశాత్తు దూలం విరిగి బాలికపై పడగా అక్కడికక్కడే మృతి చెందింది.

టెట్ హాల్ టికెట్ల అప్‌లోడ్ మరిచారా?

- విద్యాశాఖపై అభ్యర్థుల ఆగ్రహం

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): విద్యాశాఖ నిర్లక్ష్యంపై టెట్ అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం నుంచి టెట్ హాల్ టికెట్లు జారీ చేస్తామని, అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విద్యాశాఖ తొలుత ప్రకటించింది. దీంతో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి అభ్యర్థులు ఇంటర్నెట్ సెంటర్లకు వెళ్లారు. రాత్రి 7 దాటినా హాల్‌టిక్కెట్లను అప్‌లోడ్ చేయకపోవడంతో గంటల తరబడి నిరీక్షించారు. అయినా ఫలితం లేకపోవడంతో ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. షెడ్యూల్ ప్రకటించి ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా అని నిలదీశారు.

రైతు నెత్తిన సర్వే పిడుగు!

మొదటిపేజీ తరువాయి...

ప్రస్తుతం పనిచేస్తున్నారు. మిగతా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గణాంకాలను బట్టి ఒక్కో మండలంలో రోజుకు 5-10 రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. కొన్ని మండలాల్లో ఈ సంఖ్య 20-30 వరకు ఉంటున్నాయి. ఒక్క సర్వేయర్ రోజుకు ఇన్ని భూముల సర్వే నిర్వహించగలరా? అన్నది ప్రభుత్వమే తేల్చాల్సి ఉన్నది. పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏల నుంచి వెయ్యి మందిని సర్వేయర్లుగా నియమిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. ఇప్పటికే వారి నుంచి ఆప్షన్లు తీసుకుంటున్నది. అయితే వీరు సైతం అందుబాటులోకి వచ్చినా మండలానికి ఇద్దరు సర్వేయర్లు మాత్రమే ఉంటారు. అయితే ఒక సర్వేయర్ రోజుకు సగటున ఒకటి రెండు భూముల సర్వే మాత్రమే చేయగలుగుతారని చెప్తున్నారు. ఈ లెక్కన రోజువారీ డిమాండ్‌ను తట్టుకోవడం కష్టమేనని నిపుణులు చెప్తున్నారు.

అవినీతికి ఆస్కారం

ఇప్పటికే రైతులు తమ భూమి సర్వే చేయించుకునేందుకు సర్వేయర్లను బతిమాలాల్సి వస్తున్నది. పై అధికారులను కలిసి పైరవీలు చేయించాల్సి వస్తున్నది. పైగా, కొలతలు వేసిన తర్వాత కచ్చితంగా ఎంతోకొంత ముట్టజెప్పాల్సిందేనని రైతులు చెప్తున్నారు. కొత్త నిబంధనతో రైతుల అవసరాన్ని బట్టి 'వసూలు' చేసే మొత్తం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం అవుతున్నది. అవినీతికి ఆజ్యంపోసే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడుతున్నారు. మండలాల్లో లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఉన్నా వారిని రైతులు పెద్దగా నమ్మడం లేదు. దీంతో ప్రభుత్వ సర్వేయర్లకే డిమాండ్ కొనసాగనున్నది. ఇలా కొత్త నిబంధనతో రైతులు అత్యవసరంగా భూమిని అమ్ముకునే పరిస్థితి లేకపోవడంతోపాటు రోజులపాటు ఎదురుచూసే అవస్థ తప్పదని పేర్కొంటున్నారు.

వివాదాలను పరిష్కరించేదెవరు?

రాష్ట్రంలో ప్రస్తుతం భూ విస్తీర్ణానికి సంబంధించి అనేక వివాదాలు ఉన్నాయి. రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి, వాస్తవ విస్తీర్ణానికి మధ్య అనేక వ్యత్యాసాలు ఉన్నాయి. ఒక రైతు తన పొలాన్ని సర్వే చేయించే సమయంలో భూమి ఎక్కువగా వచ్చినా, తక్కువగా వచ్చినా.. దానిని ఏం చేస్తారనే దానిపై చట్టంలో స్పష్టత లేదు. ఉదాహరణకు ఒక రైతు రికార్డులో రెండున్నర ఎకరాలు ఉండి, వాస్తవంగా రెండు ఎకరాలు మాత్రమే ఉంటే.. ఆ రైతు రెండు ఎకరాలను ఇతరులకు అమ్మి రిజిస్ట్రేషన్ చేస్తే, మిగతా అర ఎకరాన్ని ఏం చేస్తారనేది ప్రశ్నగా మారింది. ప్రభుత్వ భూములు, పట్టాలపై ఏం చేస్తారనేది స్పష్టత లేకుండా పోయింది.

వీఆర్వోలు, వీఆర్ఏల వెనుకంజ

రాష్ట్ర ప్రభుత్వం పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలను సర్వేయర్లుగా నియమించాలని భావిస్తున్నది. ఈ మేరకు ఇప్పటికే ఆప్షన్లు తీసుకుంటున్నది. ఈ నెల 28లోగా తమ అభిప్రాయాలు తెలపాలని ఆదేశాలు జారీచేసింది. సర్వీస్ నిబంధనలపై స్పష్టత లేకపోవడంతో వారు వెనుకంజ వేస్తున్నారు. నేరుగా సర్వేయర్లుగా నియమిస్తారా? లేదా రెవెన్యూ శాఖలో వీఆర్వోగా నియమించి డిప్యూటేషన్ ఇస్తారా? అన్నది స్పష్టతలేదు. ఒకవేళ సర్వేయర్లుగా నియమించాల్సి వస్తే, ఉద్యోగార్హతల విషయంలో వచ్చే సాంకేతిక సమస్యలపై ఏం చేస్తారనే స్పష్టత కూడా లేదు. మరోవైపు రెండు మూడేండ్లుగా వారు వివిధ విభాగాల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. ఇప్పుడు సర్వేయర్లుగా వస్తే ఆ సర్వీస్‌ను కొనసాగిస్తారా? లేదా మళ్లీ మొదటి నుంచీ ప్రారంభించాల్సి వస్తుందా? అని సందేహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొన్నాళ్లపాటు ఎదురుచూసిన తర్వాతే ఆప్షన్లు ఇవాలని భావిస్తున్నట్టు రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

సర్వేతో సమస్యలు

- సర్వే కోసం రైతు అదనంగా ఫీజు చెల్లించాలి
- సర్వే చేయాలని అధికారులను బతిమాలుకోవాలి.
- కొలతలు, మ్యాప్ వచ్చే వరకు రిజిస్ట్రేషన్ జరగదు.
- సర్వే తర్వాత ఎంతోకొంత ముట్టజెప్పాల్సి వస్తుంది.
- రైతుకు అత్యవసరమైతే డిమాండ్ మేర చెల్లించాలి.